

91 ఉద్యోగాలకు మెరిట్ జాబితా విడుదల

రింగురోడ్డు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని 21 కేటగిరీల్లో 91 ఉద్యోగాలకు సంబంధించిన మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా విజయనగరం.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో చూడొచ్చనని, ఆ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా సరైన ఆధారాలతో రావాలని సూచించారు.

కొత్త వంగడాలను ఆవిష్కరించాం

- వాటిపై రైతుల్లో అవగాహన తెస్తాం
- మామిడి పంట విస్తీర్ణం పెరిగితే ఎన్నో లాభాలు
- కొత్త పరిశ్రమలొస్తాయి
- పంటల్లో రసాయన ఎరువులు తగ్గించాలి
- ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజయనగరం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'వరి, ఇతర పంటలపై నిత్యం అధ్యయనం చేస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉపయోగించేందుకు వరి, మొక్కజొన్న, వేరుశనగ, అపరాల కోసం ప్రత్యేకంగా నూతన వంగడాలను ఆవిష్కరించాం. వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తాం' అని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త కె.లక్ష్మణరావు తెలిపారు. తనను కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అనేక అంశాలను వెల్లడించారు. పంటల్లో రసాయన ఎరువులు తగ్గించాలని కోరారు. ఈ విషయంలో తొందరగా మార్పులు రావాలన్నారు.

ప్రశ్న: పంటలపై ఉష్ణోగ్రతల ప్రభావం ఏ మేర ఉంటుంది?
జ: ఏటా వేసవిలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతూ వస్తున్నాయి. గత పదేళ్లుగా ఈ పరిస్థితి కన్పిస్తోంది. అంతకుముందు 0.5 డిగ్రీలు పెరిగేది. దీంతో పెరిగినట్టు అన్పించేది కాదు. ఇప్పుడలా కాదు. ఏటా ఒకటి నుంచి రెండు డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ప్రభావం మనిషిపైనే కాదు పంటపైనా పడుతోంది. దిగుబడి తగ్గుతోంది.

ప్రశ్న: ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణాలేంటి?
జ: నానాటికీ కాలుష్యం పెరుగుతోంది. పంటలకు, అటు మానవాళి మనుగడకూ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగం పెరగడం ఇబ్బందికరమే. ఎక్కడికక్కడ అడ్డుకట్ట పడాలి. ఇందుకు అందరి సహకారం (మిగతా 8వ పేజీలో..)



సారిపల్లి గ్రామం

తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన సారిపల్లి గ్రామస్థులు పునరావాస (ఆర్అండ్ఆర్) ప్యాకేజీ కోసం ఎదురు చూస్తున్నారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాస ప్యాకేజీ వర్తింపజేయాలని ఏడేళ్లుగా కోరుతున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. కనీసం పీఏఎఫ్ (ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్)ప్యాకేజీ అయినా ఇవ్వాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులపై ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా ప్రయోజనం లేకపోయింది. జిల్లా నుంచి ఢిల్లీ వరకూ ప్రజాప్రతినిధులందరికీ తమ డిమాండ్‌పై లిఖిత పూర్వక వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు.

ప్యాకేజీ అందేనా?



- ఏడేళ్లుగా సారిపల్లి గ్రామస్థుల ఎదురుచూపు
- తారకరామ తీర్థసాగర్‌లో భూములు కోల్పోయిన వైనం
- నిర్వాసితులను పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- ప్రస్తుత ప్రభుత్వంపైనే ఆశలు

నెల్లిమర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం విజయనగరానికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో, మండల కేంద్రం నెల్లిమర్లకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న సారిపల్లిలో సుమారు 1,200 కుటుంబాలు జీవిస్తున్నాయి. దాదాపు 5 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి దశాబ్దాలుగా గ్రామంలో ఉన్న సాగు భూములే దిక్కు. ఏడు సంవత్సరాల కిందట గ్రామ పరిధిలోని కుమిలి చెరువు వద్ద తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికోసం సారిపల్లికి చెందిన సుమారు వెయ్యి ఎకరాల సాగుభూమితోపాటు ఏటీ అగ్రహారం, కోరాడపేట, సీతారామునిపేటలోని పంట భూములను స్వాధీనం చేసుకుంది. అయితే రిజర్వాయర్ పరిధిలో సాగు భూములతోపాటు ఏటీ అగ్రహారం, కోరాడపేట ఊర్లు కూడా ముంపునకు గురికానున్నా యని భావించిన అధికారులు ఈ రెండింటిని ముంపు గ్రామాలుగా ప్రకటించి వారికి పునరావాస ప్యాకేజీ అమలు చేశారు. మొత్తంసాగు భూములన్నీ పోయిన సారిపల్లిని మాత్రం అధికారులు ముంపు గ్రామంగా ప్రకటించలేదు. గ్రామంలోని ఇళ్లకు రిజర్వాయర్ ప్రభావం లేదని అధికారులు చెప్పడంతో సారిపల్లి గ్రామస్థులు ఖంగుతిన్నారు.

భూములు తీసుకుని మమ్మల్ని వదిలేస్తారా?

సారిపల్లి గ్రామస్థులకు ప్రధాన జీవనాధారం సాగు భూములే. వాటిని రిజర్వాయర్ కోసం తీసుకున్నప్పుడు తాము ఈ గ్రామంలో ఉండి ఏం ప్రయోజనం అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని ఇప్పటికైనా ముంపు గ్రామంగా (మిగతా 8వ పేజీలో..)



రిజర్వాయర్ గట్టు

మంత్రి X జడ్పీ చైర్మన్



వేదికపై జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాస్

- వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం
- అనర్హుల పింఛన్లు తొలగిస్తాం.. అర్హులవి తొలగించం
- మంత్రి కొండపల్లి స్పష్టీకరణ
- బోర్లు మరమ్మతులకు అవసరమైతే ఎంపీ నిధులు : కలిశెట్టి

విజయనగరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జడ్పీ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రీ వేరిఫికేషన్ పేరుతో కొంతమంది పింఛన్‌దారులు బెంబేలెత్తిపోతున్నారని ఓ సభ్యుడు ప్రస్తావించగా మంత్రి కొండపల్లి సమాధానం ఇస్తూ.. గత ప్రభుత్వం కంటే ఇప్పుడే అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు సక్రమంగా అందుతున్నాయన్నారు. మధ్యలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కల్పించుకుని మాట్లాడుతూ ప్రతి విషయానికీ గత ప్రభుత్వం, గత ప్రభుత్వం అనవద్దని, ప్రస్తుత ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్‌దారులను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం సాగింది. ఇది మినహా జడ్పీ సమావేశం ప్రశాంతంగా జరిగింది. వేసవిలో తాగునీటి సమస్యపైనే ఎక్కువ సమయం చర్చ జరిగింది.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జడ్పీ సమావేశ భవనంలో అరగంట ఆలస్యంగా 11 గంటలకు ప్రారంభమైంది. జడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ సమావేశాన్ని ప్రారంభించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ అంబేడ్కర్‌తో పాటు పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌కుమార్ హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో కురుపాం నియోజకవర్గంలో ఏకలవ్య పాఠశాల గురించి మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీలు ప్రస్తావించారు. కలెక్టర్ శ్యామ్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా వున్న పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని (మిగతా 8వ పేజీలో..)



విలేకరులతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత, పక్కన డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీలు వకుల్‌జిందాల్, మహేశ్వర్‌రెడ్డి

గంజాయిపై ఉక్కుపాదం

- విశాఖ రేంజ్‌లో రూ.5కోట్ల ఆస్తుల జప్తు
- ప్రతీ జిల్లాలో సైబర్ స్టేషన్.. 5 శక్తి బృందాలు
- రాష్ట్రంలో 7శాతం తగ్గిన నేరాలు
- పోక్సో కేసుల్లో నాలుగు నెలల్లోనే శిక్ష ఖరారు

హోం మంత్రి అనిత

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో బుధవారం పర్యటించిన ఆమె మూడు జిల్లాల పోలీస్ అధికారులతో సమీక్షించారు. తొలుత శ్రీకాకుళం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం ఈగల్ టీంలను ఏర్పాటు చేశాం. పాడేరు, మన్యం వంటి చోట గంజాయి సాగును నివారించాం. మాదకద్రవ్యాల కేసుల్లో మూలాలు కనుక్కొని, నేరస్థుల ఆర్థిక స్థితి గతులపై ఆరా తీసి వారి ఆస్తులను జప్తు చేస్తున్నాం. విశాఖ రేంజ్ పరిధిలో మూడు కేసుల్లో రూ.5కోట్ల ఆస్తులు జప్తు చేశాం. గంజాయి సాగు (మిగతా 6వ పేజీలో..)

ఎంఎస్ఎంఈలతో పారిశ్రామిక ప్రగతి

- నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్
- కలెక్టర్లు అంబేడ్కర్, శ్యామ్ ప్రసాద్

6




మ్యుటేషన్ కష్టాలు

- ఎఫ్ఏఎంసీ ధ్రువపత్రాలపై అభ్యంతరం
- ఎఫ్ఎంసీ పత్రాలనే మ్యుటేషన్‌కు స్వీకరణ
- ఇబ్బంది పడుతున్న రైతులు

కలెక్టరేట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):

- గంట్యాడ మండలం వెలగాడ గ్రామానికి చెందిన బి.అప్పారావు 2018లో మృతి చెందారు. ఈయన పేరున ఉన్న భూమిని భార్య పేరున మార్చుకునేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు (ఎఫ్ఏఎంసీ)కు దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. ఆపై ఏపీ సేవలో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ఎఫ్ఏఎంసి అయితే ఆన్‌లైన్‌లో తీసుకోదని, ఎఫ్ఎంసి అనే మాత్రమే ఉండాలని ఏపీ సేవ నిర్వాహకులు చెప్పడంతో అప్పారావు కుటుంబీకులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోలేకపోయారు.
- విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన పి.పెద్ద కృష్ణ 2019 ఫిబ్రవరిలో మరణించారు. ఆయన పేరున ఉన్న భూమిని భార్య దేవుడమ్మ పేరున మార్పు చేయడం కోసం ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఎఫ్ఏఎంసి మంజూరు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరించలేదు. దీంతో ఆ కుటుంబీకులు ఎఫ్ఎంసికి మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు భూముల (మిగతా 8వ పేజీలో..)



ఏపీ సేవలో ఎఫ్ఏఎంసీ నెంబరు ఎంటర్ చేశాక ఇన్వాలిడ్ యూజర్ అని తెరపై వచ్చిన దృశ్యం

ఇక పంటలు భద్రం

- త్వరలో అందుబాటులోకి మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలు
- గిరిజన ఉత్పత్తుల నిల్వకు అవకాశం
- సాలూరు, సీతంపేటలలో ఏర్పాటు

6



రాజాం ఎన్నాళ్లిలా?

ఒకప్పుడు పారిశ్రామిక పట్టణంగా పేరొందిన రాజాం రెండు దశాబ్దాలుగా అభివృద్ధి లేని ప్రాంతంగా మిగిలింది. కొత్త పరిశ్రమలు రాకపోగా గత ప్రభుత్వ తీరుతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఒక్కటొక్కటిగా మూత పడ్డాయి. మార్కెట్ పరంగా చూస్తే చుట్టుపక్కల మండలాల ప్రజలంతా ఏం కావాలన్నా రాజాం రావాల్సిందే. మూడు జిల్లాలకు రోడ్డు కనెక్టవిటి ఉండడంతో అభివృద్ధికి అవకాశాలు ఎక్కువ. కానీ అందిపుచ్చుకునే పరిస్థితి లేదు. ఈ దుస్థితికి పాలకవర్గం లేకపోవడం ప్రధాన కారణం. మున్సిపాలిటీగా మారినా అభివృద్ధిలో పల్టీలు కొడుతోంది. స్థానికంగా విలువైన ఆస్తులున్నా వాటిని అపూర్వ ఆదాయ వనరులుగా మలుచుకునే ప్రణాళిక అధికారుల వద్ద లేదు.

- రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా..
- పాలకవర్గం లేకే ఈ దుస్థితి
- మునిసిపాల్టీగా అవతరించినా కొత్తదనం లేకపోయె
- గత ఐదేళ్లలో కొనసాగిన వివక్ష
- విలువైన ఆస్తులు ఉన్నా.. ఫలితం సున్నా

రాజాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజాం పంచాయతీ స్థాయి నుంచి మేజర్ పంచాయతీగా, తరువాత నగర పంచాయతీగా.. ఆపై మునిసిపాల్టీగా అవతరించింది. భౌగోళికంగా మార్పు చెందినా అభివృద్ధిలో మార్పు లేదు. రెండు దశాబ్దాలు దాటుతున్నా ఇంతవరకూ కార్యవర్గం లేదు. ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం లేక అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టు పరిస్థితి నడుస్తోంది. మునిసిపాల్టీకి ఆదాయ వనరులు ఉన్నా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం గమనార్హం. అధికారుల అడ్డగోలు నిర్ణయాలు, నిర్లక్ష్యం మునిసిపాల్టీకి శాపంగా మారాయి. రాజాం పట్టణంతో పాటు ఇందులో విలీనమైన సారధి, కొత్తవలస, పొనుగూటివలస, కొండంపేట పంచాయతీలకు దశాబ్దాల కాలంగా పాలకవర్గాలు లేవు. 2005లో రాజాం, సారధి మేజర్ పంచాయతీలతో పాటు ఆ మూడు పంచాయతీలను విలీనం చేస్తూ రాజాం నగర పంచాయ తీని ఏర్పాటుచేశారు. మూడేళ్ల కిందట థర్డ్ గ్రేడ్ మునిసిపాల్టీగా అవతరించింది. ఇంతవరకూ ఎన్నికలు జరగలేదు. ప్రత్యేకాధికారుల పాలనలో నెట్టుకొస్తున్నారు. దీంతో మునిసిపాల్టీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా ఎలాంటి సమస్యలూ పరిష్కారం కావడం లేదు.

నాలుగు షాపింగ్ కాంప్లెక్సులు

మునిసిపాల్టీకి పట్టణంలో విలువైన (మిగతా 8వ పేజీలో..)

అన్నీ ఉన్నా.. షికారు లేదు

- రెండు బోట్లు కొనుగోలు చేసినా నిరుపయోగమే
- తోటపల్లి ప్రాజెక్టులో తుప్పు పడుతున్న సామగ్రి
- పర్యాటకంపై దృష్టి సారించని యంత్రాంగం


తోటపల్లి రిజర్వాయర్

గరుగుబిల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ప్రాంతం పర్యాటకులకు అనువుగా ఉన్నా అభివృద్ధిపై యంత్రాంగం దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. పార్వతీపురం నుంచి పాలకొండ ప్రధాన రహదా రికి ఆనుకుని ఐటీడీఏ పార్కు, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, తోటపల్లి స్పిల్‌వే ప్రాజెక్టు తదితర పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తోటపల్లి ప్రాజె క్టులో బోటు షికారును ఏర్పాటు చేశారు. దీనికి అనుగుణంగా ఐటీడీఏ పార్కును ఏర్పాటు చేశారు. గతంలో ప్రాజెక్టు అధికారులుగా వ్యవహరించిన లక్ష్మీశా, సువర్ణ పండాదాస్‌లు పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు గిరిజనులకు ఉపాధి అవకాశాల కల్పనకు చొరవ చూపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటకంపై అంతగా దృష్టి సారించలేదు. ప్రాజెక్టులో అధికంగా గుర్రపు డెక్క ఉండ డంతో బోటు షికారుకు ఇబ్బందులు ఎదురయ్యా యి. పర్యాటకులను ఆకర్షించేందుకు పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్పీడ్ బోటు, వాటర్ బైక్స్‌తో పాటు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. ఏపీ టూరిజంకు సంబంధించి రూ. 22 లక్షల వ్యయంతో రెండు బోట్లు కొనుగోలు చేశారు. వీటికి తోడు వాటర్ స్పోర్ట్స్‌కు సంబంధించి కొంతమేర సామగ్రిని కొనుగోలు చేశారు. బోటు షికారు బాధ్యతను ప్రైవేటుకు చెందిన వాటర్ స్పోర్ట్స్ సింపిల్ కంపెనీకి అప్పగించారు. బోటు షికారు కోసం ఆరుగురు సిబ్బందిని నియమించారు. దీనికి ఆటంకాలు ఎదురవడంతో వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఎదురైంది. దీంతో మూడు బోట్లను తాడిపూడి రిజర్వాయర్‌కు తరలించారు. ప్రస్తుతం ఇక్కడ బోటు షికారు నిర్వహించకపోవడంతో సామగ్రి తుప్పుపట్టి పనికి రాని విధంగా తయారయ్యాయి. ఐటీడీఏ పార్కుకు వచ్చిన వారు బోటు షికారు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


బోటు షికారుకు వెళ్లకుండా ముళ్ల కంపలు వేసిన దృశ్యం


బోటు షికారుకు వెళ్లే మార్గంలో గేటుకు తాళం వేసిన దృశ్యం

తగ్గిన గుర్రపు డెక్క

ప్రాజెక్టు ప్రాంతంలో వర్షాకాలంలో అధికంగా గుర్రపు డెక్క పేరుకుంది. ప్రస్తుత వేసవిలో ప్రాజెక్టులో గుర్రపు డెక్క కనుమరుగైపోయింది. దీంతో ఈ ప్రాంతంలోని పలువురు బోటు షికారుకు ఎప్పుడు మోక్షం లభిస్తుం దోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

గేటుకు తాళం

ప్రాజెక్టు ప్రాంతంలో బోటు షికారుకు వెళ్లకుండా మె ట్లపై ముళ్ల కంచెలు వేశారు. ప్రధాన ద్వారానికి తాళం వేశారు. ప్రాజెక్టు ఒడ్డున రెండు బోట్లు గుర్రపు డెక్క మధ్యలో ఉన్నాయి.

పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

తోటపల్లి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. బోటు షికారు ఏర్పాటుపై మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చొరవ చూపుతున్నారు. గుర్రపు డెక్క తొలగింపుపై ఐటీడీఏ అధికారులు, కలెక్టర్, జల వనరుల శాఖ అధికారుల దృష్టికి గతంలో తీసుకువెళ్లాం. బో టు షికారును ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించకుండా ఈ ప్రాంతంలోని గిరిజనులకు శిక్షణ ఇచ్చి నిర్వహిస్తాం. సీతంపేట, పార్వతీపురం పరిధిలోని 60 మందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అడ్వంచర్ బోట్స్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నాం. వెంగళరాయసాగర్, జంఝావతి ప్రాజెక్టు ప్రాం తాల్లో బోటు షికారుకు సన్నాహాలు చేస్తున్నాం. గుర్రపు డెక్కను కొనుగోలు చేసేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఐటీడీఏ అధికారులతో సంప్రదిస్తున్నాం. దీనిని పరిశీలించి... బోటు షికారు నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపడతాం.

- ఎన్.నారాయణరావు,
పర్యాటకశాఖ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

ఇక పంటలు భద్రం

- త్వరలో అందుబాటులోకి మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలు
- అటవీ ఉత్పత్తుల నిల్వకు అవకాశం
- సాలూరు, సీతంపేటలో ఏర్పాటు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు మంచి రోజులు రాబోతున్నాయి. పంటలకు గిట్టుబాటు ధర లభించకపోయినా.. ఎంతో కొంతకు విక్రయించాల్సిన అవసరం ఇకపై ఉండదు. వీరి కోసం కొత్తగా మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏజెన్సీలో పండించిన పంటలను భద్రపరుచుకునే వీలు లేక గిరిపుత్రులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, సీతంపేట మండల కేంద్రాల్లో బహుళ సదుపాయాల బజార్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఒక్కో మల్టీపర్పస్ కేంద్రం నిర్మాణానికి రూ.కోటి వంతున వెచ్చించ నుంది. వీటి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో టెండర్లు పిలిచి... త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు.


సీతంపేట సంతలో గిరిజనులు విక్రయించేందుకు తీసుకువచ్చిన చింతపండు

గతంలో ఏర్పాటు చేసినా..

సీతంపేట ఏజెన్సీలో తమ పంటలను భద్రపరుచుకోవడానికి కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం చేపడితే బావుంటుందని చాలా ఏళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్ మే రకు 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.33 లక్షలతో మినీ కోల్డ్‌స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ కోసం గిరిజన రైతులు అప్పట్లో ముందుకు రాకపోవడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొన్నేళ్లు నడిపారు. విద్యుత్ బిల్లు అధిక మొత్తం లో రావడం, పంటలను భద్రపరుచుకునేందుకు రైతులు ఆసక్తి కనబరచకపోవడంతో ఈ కోల్డ్ స్టోరేజ్ అనతికాలంలోనే మూతపడింది. ఆ తరువాత దీని నిర్వహణ బాధ్యతలను జీసీసీకి అప్పగించారు. వారు కూడా ఆసక్తి చూపలేదు. రూ.లక్షలు వెచ్చించి అప్పట్లో ఏర్పాటు చేసిన యంత్రాలు వినియోగంలోకి రాక... పాడైపో వడంతో కోల్డ్‌స్టోరేజ్‌ను పూర్తిగా మూసివేశారు.


సీతంపేటలో నిరుపయోగంగా ఉన్న మినీ కోల్డ్‌స్టోరేజ్

ఎంతో ఉపయోగం

సీతంపేట గ్రామంలోని తురాయిపువలస ప్రాంతంలో గిరిజన రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రం వల్ల గిరిజన రైతులకు ఎంతో మేలు కలగనుంది. సంతల్లో విక్రయించగా మిగిలిన అటవీ ఉత్పత్తులను ఈ బహుళ సదుపాయాల బజార్‌లలో భద్రపరుచు కునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఆ వారంలో పంటకు మార్కెట్ ధర తక్కువ గా ఉంటే ఉత్పత్తులను విక్రయించకుండా ఈ కేంద్రాల్లో భద్రపరుచుకొని... అనుకు న్న ధర వచ్చినప్పుడే అమ్ముకునే వెసు లుబాటు ఉంటుంది. దీంతో పంటల ద్వారా మంచి ఆదాయం రావడంతో పాటు దళారుల బెడద కూడా తీరనుంది. సీతంపేట ఏజెన్సీలో ప్రధానంగా పసుపు, జీడి, కొండచీపుర్లు, అల్లం, చింతపండు, పనస, పైనాపిల్, పెండ్లం, అరటి తదితర పంటలను గిరిజనులు వారపుసంతలకు తీసుకువస్తారు. వీటిలో జీడి, కొండ చీపుర్లు, చింతపండుకు మద్దతు ధర లేక గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నా రు. గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ పంటను భద్రపరుచుకొనేందుకు అవకా శం లేకపోవడం... తిరిగి ఇంటికి తీసుకు పోయేందుకు రవాణా ఖర్చులు భరించ లేకపోవడం వంటి కారణాలతో అతి తక్కువ ధరకు విక్రయించేవారు. సీతంపే ట, సాలూరుల్లో నిర్మించనున్న బ హుళ సదుపాయాల బజార్లతో తమ కష్టాలు తీరనున్నాయని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా వారపుసంతకు వచ్చే గిరిజనులు వారికి అవసరమైన నిత్యావసర సరుకులు కూడ ఈ బహుళ సదుపాయాల బజార్లలో కొనుగోలు చేసుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ఉపయోగించుకుంటాం

గిరిజనుల కోసం ప్రభుత్వం నెలకొల్పుతున్న బహుళ సదుపాయాల బజార్‌ను వినియోగిం చుకుంటామని బీరపాడు గ్రామానికి చెందిన సవర పొల్లయ్య అనే గిరిజన రైతు తెలిపాడు. దీని వల్ల సంతకు తీసుకువచ్చిన ఉత్పత్తులను భద్రపరుచుకోవడానికి వీలు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. గిరిజన ఉత్ప త్తులకు ఐటీడీఏ, జీసీసీ మద్దతు ధర కల్పించాలని కోరాడు.

గిరిజనులకు మేలు

సీతంపేటలో నిర్మించనున్న బహుళ సదుపాయాల బజార్ వల్ల గిరిజన రైతులకు మేలు జరుగుతుందని ఆ సంఘ నాయకుడు సాంబయ్య అన్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు, దళారుల వల్ల రైతులు ఇకపై నష్టపోకుండా ఉంటారని పేర్కొన్నారు. సీతంపేట ఏజెన్సీలో చింతపండు, కొండచీపుర్లకు ఆశించిన ధర రావడం లేదని.. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. జీసీసీ అటవీ ఉత్ప త్తుల కొనుగోలులో వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించి గిరిజన రైతులకు నష్టం లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజనుల అభివృద్ధే ధ్యేయం



గిరిజనుల అభివృద్ధికి ప్ర భుత్వం కట్టుబడి ఉంది. దీ నిలో భాగంగానే మారు మూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నాం. మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రం వినియోగంలోకి వస్తే గిరిజన రైతుల ఆదాయం పెరుగుతుంది.

- నిమ్మక జయకృష్ణ,
ఎమ్మెల్యే, పాలకొండ


వ్యాన్ నుంచి కొండచీపుర్లను దించుతున్న దృశ్యం

గంజాయిపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

స్మగ్లింగ్, కొనుగోలు చేసిన వారిపై పీడీ యాక్ట్ పెడుతున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అరికట్టడంలో పట్టు సాధిస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయి. రాష్ట్రంలో నేరాల శాతం 7శాతం తగ్గాయి. పోక్సో కేసుల్లో కఠినంగా వ్యవ హరిస్తున్నాం. విజయనగరం జిల్లాలో 67 పోక్సో కేసులు నమోదు కాగా, 20 కేసుల్లో నిందితులకు నాలుగు నెలల్లోనే శిక్ష పడేలా చర్యలు తీసుకున్నాం. శ్రీకాకుళం జిల్లాలో నేటికి రూ.4కోట్ల మేర ప్రోపర్టీని రికవరీ చేసి నిందితులను అరెస్టు చేశాం. సంకల్పం కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికల భద్రతతో పాటు, గంజాయి నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ జిల్లాలో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేస్తాం. ఈ బృందాల ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తుల ఫిర్యాదు మేరకు వారి సమస్యలను పరిష్కరిస్తాం. ప్రతీ జిల్లాలో ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి నైపుణ్యం కలిగిన అవుట్ సోర్సింగ్ యువతను నియమించి పెండింగ్‌లో ఉన్న సైబర్ కేసులను పరిష్కరిస్తాం.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయాన్ని హోం మంత్రి అనిత సందర్శించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్‌జిందాల్, పా ర్వతీపురం మన్యం ఏఎస్పీ అంకిత సురాన హోం మంత్రికి స్వాగతం పలికారు. అ నంతరం మూడు జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహిం చారు. నేరాల గణాంకాలు, రేంజ్ పరిధిలో ఎస్పీలు తీసుకుంటున్న చర్యలపై డీఐజీ గోపినాథ్ జెట్టి హోంమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసుల ప్రతిష్ఠ పెంచేలా ప్రతీ ఒక్కరూ విధులు నిర్వహిం చాలని అన్నారు. ప్రజల కు మెరుగైన సేవలందించేందుకు దశల వారీగా పోలీసు శాఖకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పోలీసు వాహనాలు, ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను అందిస్తామని తెలిపారు. విద్యాలయాలు, గృహ సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలు, ఫిర్యాదు దారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.

ఎంఎస్ఎంఈలతో పారిశ్రామిక ప్రగతి

- నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్
- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 6500కు పైగా ఎంఎస్ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి అవ కాశం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే పారిశ్రామిక, సేవా రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. స్వర్ణాంధ్ర -2047 కెపాసిటీ బిల్డింగ్‌పై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులకు రెండు రోజుల వర్క్‌షాపు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రారంభి చారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి నియోజకవ ర్గానికి విజన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. క్షేత్ర స్థా యి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. స్థానిక ఎంఎల్ఏల సూచనలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, ప్రణాళిక శాఖ రిటైర్డ్ డైరెక్టర్, సలహాదారు సీతాపతిరావు, మూడు జిల్లాలకు చెందిన సీపీవోలు బాలా జీ, వీర్రాజు, లక్ష్మీప్రసన్న, నియోజకవర్గాల ప్రత్యేకాధికా రులు, పర్యవేక్షణ బృందాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఘనంగా నూకాలమ్మ అనుపోత్సవం

కురుపాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కురుపాం గౌడువీధిలోని నూ కాలమ్మ అమ్మవారి అనుపోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించా రు. మేళతాళాలు, ఘటాలతో అమ్మ వారిని ఊరేగిం చారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ఉన్న నూకాలమ్మ గుడి వద్ద ఉపారాలు తీసి పూజలు చేశారు. అనంత రం అనుపోత్సవాన్ని నిర్వహించారు. కా ర్యక్రమంలో స్థానిక గౌడు సామాజి క వర్గం వారితో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అనుపోత్సవంలో భాగంగా ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

కొండ ఎక్కి.. ఆటోలో వెళ్లి

- గిరిజన గ్రామాల్లో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

సాలూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు బుధవారం సాలూరు మండలం మారయ్యపాడు, తాడిలోవ, పాలికవలస, పెదపథంలో పర్యటించారు. మారయ్యపాడు గిరిశిఖరాన ఉండడంతో పాటు రహదారి బాగులేదు. దీంతో ఆయన కొంత దూరం కొండపైకి నడిచారు. స్థానికులు కొంత దూరంలో ఆటో ఏర్పాటు చేయడంతో దానిలో ఆయన గ్రామానికి చేరుకు న్నారు. పెద మారయ్యపాడులో తాగు నీరు, అటవీ భూహక్కుల పట్టాలు, పా ఠశాల భవనం కావాలని తదితర సమ స్యలను గిరిజనులు ఆయనకు వివరిం చారు. చిన మారయ్యపాడు గిరిజనులు మినీ అంగన్‌వాడీ కేంద్రం కావాలని కోరారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల సమస్యను వివరించారు. తాడిలోవ, పాలికవలస, పెదపథం గిరిజనులు కూడా ఆర్వోఎఫ్ ఆర్ పట్టాల సమస్యను వివరించారు. విద్యుత్ స్తంభాల ఏ ర్పాటుపై విన్నవించారు. ఆర్వోఎఫ్ఆర్‌పై తహసీల్దార్ రమణ ను ఆయన ప్రశ్నించగా 1150 పట్టాలు పెండింగ్‌లో ఉన్నా యని ఆయన చెప్పారు. ఆర్వోఎఫ్ఆర్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. గిరిజనుల సమస్యలను కమి షన్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చే స్తుందని శంకరరావు తెలిపారు. ఆయనతో సాలూరు తహ సీల్దార్ ఎన్వీ రమణ, ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, ఎస్ఐ న ర్సింహమూర్తి, సాలూరు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, మత్స విజయభాస్కర్, దండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మారయ్యపాడు కొండ ఎక్కుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

బొబ్బిలి ఐటీఐలో విచారణ

- అవకతవకలపై డీడీ ఆరా

బొబ్బిలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో గతంలో స్త్రైవ్ పథకంలో మంజూరైన సుమారు రూ.90 లక్షల విలువైన పరికరాలకు సంబంధించి అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలపై ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటరావు విచారణ చేపట్టారు. ఐటీఐలో ఆయన మంగళ, బుధవారాలలో విచారణ చేపట్టినప్పటికీ సమాచారాన్ని బ యటకు పొక్కనీయలేదు. విషయం తెలుసుకున్న స్థానిక మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకు న్నారు. వారిని కలుసుకునేందుకు ఆ యన ఇష్టప డలేదు. వివరాలు వెల్లడించడానికి, కనీ సం ఫొటో తీసుకునేందుకు కూడా సమ్మతించలేదు. బయటి నుంచే మీడియాను పంపించివేశారు. ఐటీఐలో వివిధ అంశాలలో అవకతవకలు జరిగినట్లు కొంతమంది విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారికన్నా ముందుగా శాఖాపరంగా డీడీ విచారణ చేపట్టినట్లు తెలిసిం ది. ఐటీఐలో పనిచేస్తున్న సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిపించి... ఆయన విచారించినట్లు తెలిసింది. ఐటీఐలోని వివిధ విభా గాలను కూడా పరిశీలించినట్లు సమాచారం.


పరికరాలను పరిశీలిస్తున్న దృశ్యం

బీసీ కాలనీలో నడకా నరకమే..

● 22 ఏళ్లుగా ఇదే పరిస్థితి ● తాగునీరు, డ్రైన్లూ కరువే.. ● పాలకుల హామీలు నెరవేరేదెప్పుడో

నెల్లిమర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ 11వ వార్డులోని బీసీ కాలనీవాసుల కష్టాలు అన్నీఇన్నీ కావు. 22 ఏళ్ల కిందట నగర పంచాయతీ పరిధిలో రోడ్డు విస్తరణ చేసే సమయంలో ఇళ్లు కోల్పోయిన వారందరికీ బీసీ కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అక్కడ సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. కానీ అక్కడ రోడ్డు, తాగునీటి సదుపాయం, మురుగునీటి కాలువలు లేవు. దాంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గుట్టలతో కూడిన ప్రాంతంలో రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో రాళ్లపై నుంచి నడవడమూ కష్టంగానే ఉంటోంది. మురుగునీరు అంతా ఒకచోటకు చేరి మురికవాడను తలపిస్తోంది. మురుగునీరు నిలిచపోవడం వల్ల స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఎన్నికల వేళ.. రోడ్లు, కాలువలు వేస్తామని చెప్పిన నాయకులు వారి పనయ్యాక బీసీ కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదు. తాజాగా జరిగిన ఎన్నికల ముందు జనసేన పార్టీ అభ్యర్థిగా లోకం మాధవి కూడా అవే హామీలు ఇచ్చారు. ఆమె ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే బీసీ కాలనీవాసులకు ఇచ్చిన హామీని ఆమె నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కాలనీ దారిలో ప్రవహిస్తున్న మురుగునీరు


రాళ్లుతేలిన బీసీ కాలనీ రోడ్డు

ముఖ్యమంత్రిని కలిసిన చంద్రశేఖరరావు

డెంకాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు కంది చంద్రశేఖరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నియోజకవర్గంలోని పలు సమస్యలు, రాజకీయ పరిస్థితులను వివరించారు. ఆయనతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి పిన్నింటి రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ సేతు మాధవన్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక నుంచి జేసీ ఆధ్వర్యంలో ఆయన ఆదేశాలకు అనుగుణంగా గ్రంథాలయ సంస్థ కార్యకలపాలు జరగనున్నాయి.

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

విజయనగరం కలెక్టరేట్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం బుధవారం ముగిసింది. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన మూల్యాంకన ప్రక్రియ పూర్తయింది. ఈనెల 3 నుంచి ప్రారంభమైన మూల్యాంకనంలో 117 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 702 అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 234 మంది స్పెషల్ అసిస్టెంట్లు వెరసి 1100తో ఈ ప్రక్రియ ముగిసింది.

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 13న ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి వారికి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం వారికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

హామీలు నిలబెట్టుకుంటాం

చీపురుపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోను వమ్ము కానివ్వబోదని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. బుధవారం చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తే.. అధినేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

రక్షిత నీటిని అందించడమే ధ్యేయం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షిత తాగునీటిని అందించటమే ధ్యేయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. బుధవారం నగరంలోని అన్ని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. ప్రజల కూడా నీటిని వృథా చేయకుండా కుళాయిలకు హెడ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారం అందించండి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుల్ మీర అన్నారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. వంటకు వాడుతున్న సామగ్రి నాణ్యతలను పరిశీలించారు.

13 అడుగుల గిరినాగు పట్టివేత

వేపాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి శివారు చినదుంగాడ సమీపంలోని కలవచెరువు ప్రాంతంలో 13 అడుగుల గిరినాగు కలకలం సృష్టించింది. అదే గ్రామానికి చెందిన స్నేక్ ప్రాచర్స్ వరపల కృష్ణ, వరపల జగదీశ్ దాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


పామును పట్టుకుంటున్న దృశ్యం

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

లక్కవరపుకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలోని నివాసంలో బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పించన్లు, పశువుల షెడ్లు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు, రెవెన్యూ సమస్యలు తదితర వాటిపై నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. వీటన్నింటిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు. అదే విధంగా అబాకస్ మేథ్స్ టాలెంట్ పరీక్షలలో ఉత్తమ ర్యాంకు సాధించిన అలమండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆర్టీసీని సంరక్షించేందుకే ప్రహరీ

రాజాం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడంతో పాటు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అనధికార వ్యక్తులు, వాహనాలను నిరోదించేందుకు ప్రహరీ నిర్మించామని జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్.అప్పలనారాయణ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.ఈనెల 8న 'ఆదాయానికి అడ్డుగోడ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పాత బస్టాండ్-ఆర్టీసీ బస్‌స్టేషన్ మధ్య గోడను నిర్మించడం వల్ల మున్సిపాలిటీకి నష్టం, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోకి ఆటోలు, మేక్సీ కేబ్‌లు ప్రవేశించకుండా ఉంచేందుకు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గోడను నిర్మించామన్నారు. అనధికార విక్రేతలు, పండ్ల విక్రేతలు కాంప్లెక్స్ చుట్టూ తిరగడాన్ని నియంత్రించడంతో పాటు దాదాపు 70 ఆటోలు, 30 మేక్సీ కేబ్‌ల వల్ల ఆర్టీసీ ఆదాయంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు.

డీలర్ల సమక్షంలో తూకం వేయాలి

భోగాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గోదాం నుంచి డీలర్లకు సరుకులు సరఫరా చేసేటప్పుడు వారి సమక్షంలోనే తూనిక నిర్వహించి వారికి సరుకు అందజేయాలని గోదాం ఇన్‌చార్జి స్వర్ణలతకు జేసీ సేతు మాధవన్ సూచించారు. బుధవారం ఆయన భోగాపురంలోని పౌర సరఫరాల గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా వే బిల్లులు, రికార్డులు, గోదాంలో నిల్వలు సరిచూశారు. ఆయనతో పాటు సివిల్ సప్లైస్ డీఎం మీనాకుమారి, హెచ్‌డీటీ సుభాష్, సీఎస్‌డీటీ మురళీకృష్ణ, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులున్నారు.


రికార్డు పరిశీలిస్తున్న జేసీ

పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం ఎన్నిక

విజయనగరం రింగురోడ్డు/కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నికను బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పీఎస్‌జీ బాలకృష్ణ వ్యవహరించారు. అధ్యక్షుడిగా డాక్టర్ రెడ్డి కృష్ణ, కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్.దీనకుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ధర్మారావు, కోశాధికారిగా డాక్టర్ కె.వి.రమణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఆర్.శారదలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎల్.విష్ణు, డాక్టర్ ఎల్.రాజారవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన కార్యవర్గం

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతాం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు దళితుల హక్కుల పోరాట సమితి పోరాడుతోందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. బుధవారం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మను వాదానికి వ్యతిరేకంగా ప్రచారం చేపడతామన్నారు. రాజ్యాంగ దినమైన ఈనెల 14 నుంచి మను వాదానికి వ్యతిరేకంగా ప్రచారాన్ని చేపడతామన్నారు. ఈ సందర్భంగా యన కరప త్రాన్ని విడుదల చేశారు. ఆయనతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, ముత్యాలు, సంతోష్, రామకృష్ణ తదితరులున్నారు.

రెల్లి కులస్థులకు రిజర్వేషన్లు పెంచండి

గజపతినగరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వం రెల్లి ఉప కులస్థులకు జనాభా ప్రాతిపదికన ఒక శాతం నుంచి 5 శాతం రిజర్వేషన్ పెంచాలని రెల్లి ఉపకులాల నియోజకవర్గ ఇన్‌చార్జి జి.రామారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చంపావతి వంతెన నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రెల్లి ఉప కులస్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్య నిర్వహకుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివరణ కోరిన కలెక్టర్

విజయనగరం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'ఉడకని అన్నం పాచిపోయిన కూర' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. దాంతో సంబంధిత అధికారులు, సిబ్బంది ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని తెలిసింది.

సమస్యల పరిష్కారానికి హామీ

రాజాం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రగతి పరుగు పెడుతుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దాదాపు 50 వినతులు స్వీకరించారు. రోడు, కాలువలు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై వినతులు అందాయన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులు దృష్టిలో పెట్టి సమస్యలకు పరిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తే.. అధినేత కార్యక్రమం నిర్వహించి కార్యకర్తలకు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతి బుధవారం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అనంతరం మున్సిపాలటీ పరిధిలోని డోలపేటలో అభయ అంజనేయస్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొత్స వాసుదేవరావునాయుడు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, శాసపు రాజేశ్‌కుమార్, శాసపు రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

ప్రభుత్వ బడిని పరిరక్షించండి

రాజాం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ బడిని పరిరక్షించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు కోరారు బుధవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి పంచాయతీలో మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు, డివిజన్ కార్యదర్శి గిరడ చంద్రశేఖర్, ఎ.వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకే ప్రాధాన్యం

రేగిడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అభివృద్ధికే తొలి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని ఉణుకూరు, కందిశ, రేగిడి, ఉంగరాడ గ్రామల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూబ ధర్మారావు, గురవాన రమేష్, గేదెల బాలమురళీ, చల్ల భుజంగరావు, బెవర రాంబాబు తదితరులున్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లపై విజిలెన్స్ దాడులు

● 39 మంది రైతులపై కేసులు

మెరకముడిదాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ విద్యుత్ వ్యవసాయ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. ఆపరేషన్ అధికారులు, స్థానిక విద్యుత్ సిబ్బంది సహకారంతో విజలెన్స్ అధికారులు దాడుల చేపట్టారు. దాడుల్లో 39 మంది రైతులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఈఈలు చిట్టితల్లి, బి.వి.రమణ మాట్లాడుతూ ఎంతమంది రైతులకైనా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ అవసరమైన రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో టోల్‌ఫ్రీ నెంబరు 1912కి కాల్ చేసి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇలా అక్రమంగా విద్యుత్ వినియోగించడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. దాడుల్లో అసిస్టెంట్ ఇంజనీర్ కె.దివాకర్, వై.సూర్య ప్రభాకర్, ఎస్.సన్యాసినాయుడు, రవికుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


కనెక్షన్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు

చీపురుపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన, టీడీపీ కార్యకర్తలు బుధవారం పూజలు చేశారు. జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గవిడి నాగరాజు.. కనకమహలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. కార్యక్రమంలో కింతలి వాసు, మీసాల సూరినాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న జనసేన, టీడీపీ కార్యకర్తలు

● రాజాం రూరల్: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనయుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ రాజాంలో జనసైనికులు బుధవారం పూజలు చేశారు. ఆ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు సారథ్యంలో పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి సన్నిధిలో పూజల్లో పాల్గొన్నారు. 101 కొబ్బరికాయలు కొట్టి మార్క్ శంకర్ ఆరోగ్యం కుదటపడాలని కోరారు.

అఖిలకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటన

గరివిడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గరివిడి మండలం శివరాం గ్రామంలో యువకుడి దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న అఖిలకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందజేయనుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆమెకు వైద్య ఖర్చులను మొత్తం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నిందితుడిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

గజపతినగరం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరానికి అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ డీఈవో మోహనరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర హైస్కూల్‌లో వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని 8 మండలాలోని పాఠశాలలను పరిశీలించి నివేదికలను అందజేయనున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఎంఈవో ఎస్.విమలమ్మ, హెచ్ఎంలు మీసాల వెంకటేశ్వరరావు, చిప్పాడ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

● మహిళ మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు

రామభద్రపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లలపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లలపేట నుంచి కొట్టక్కి వెళ్తున్న ఆటోను ఇసుక కోసం గొల్లలపేట వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గొల్లలపేట గ్రామానికి చెందిన బాలి ఆదిలక్ష్మి(37) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలోని బాలి పద్మావతి, బాలి రవణమ్మ, లెంక సత్యవతి, బాలి వాసవిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బొబ్బిలి ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు లలిత, హేమ ఉన్నారు. భర్త రామకృష్ణ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గీత కార్మికుడి మృతి

బొబ్బిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వే ప్లాట్‌ఫాంపై బుధవారం గీత కార్మికుడు కోస్తు సింహాచలం(58) మృతిచెందాడు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు కథనం ప్రకారం.. తెర్లాం మండలం కె.సీతారాంపురానికి చెందిన సింహాచలం ఈనెల 3న గ్రామం నుంచి రాయగడకు కూలి పనికోసం వెళ్లి బుధవారం తిరిగి వచ్చాడు. బొబ్బిలిలో రైలు దిగి ప్లాట్‌ఫాంపై నిద్రిస్తుండగానే ఆయన ప్రాణాలు విడిచిపెట్టాడు. తెర్లాం మండలం కె.సీతారాంపురానికి చెందిన వ్యక్తి అని గుర్తించి ఆ సమాచారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగిస్తామని చెప్పారు.

పోక్సో కేసులో నలుగురి అరెస్టు

● వివరాలు వెల్లడించిన చీపురుపల్లి డీఎస్పీ రాఘువులు

రేగిడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరిట ఉచ్చులో దింపిన యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ఆ వివరాలు వెల్లడించారు. రేగిడి మండలం మునకలవలసకు చెందిన కరణం జగదీశ్ ఇదే మండలం ఒక గ్రామానికి చెందిన బాలికతో కొద్దిరోజులుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. బాలిక తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు చూస్తున్నారు. దీన్ని పసిగట్టిన సదరు యువకుడు బాలికను స్నేహితులతో కలిసి ఊరు దాటించేందుకు పథకం వేశాడు. అందులో భాగంగా మార్చి 26న జడదీశ్ చిన్నశిర్లాం గ్రామానికి చెందిన గొట్టాపు దుర్గాప్రసాద్ సహకారం కోరాడు. బాలిక మెడలో చైన్‌ను తాకట్టు పెట్టి వారికి కొంత నగదును ఇచ్చాడు. విజయవాడ రాణీతోటలోని మరో ఇద్దరు స్నేహితులు యడ్లగీత, దేవరకొండ బాలు వద్దకు ట్రైన్ టికెట్లు సమకూర్చి అదేరోజు విజయవాడకు దుర్గాప్రసాద్ పంపించాడు. అక్కడ వారు ఉండేందుకు రూమ్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమార్తె అదృశ్యమైందని మార్చి 28న రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసుల విచారణలో అసలు సంగతి బహిర్గతమైంది. బాలికను ప్రేమ పేరిట వంచించాడని గుర్తించి జగదీశ్‌తో పాటు దుర్గాప్రసాద్, యడ్ల గీత, దేవరకొండ బాలులను అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, ఎస్ఐ నీలావతి ఉన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

జామి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ వివరాలు వెల్లడించారు. అలూరి సీతారామరాజు జిల్లా అరుకు నుంచి జామి మీదుగా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై విజయనగరం గంజాయి తరలిస్తున్నారని సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ వీరజనార్ధన్ తన సిబ్బందితో మండలంలోని అలమండ రైల్వే స్టేషన్ వద్ద కాపుకాశారు. ఈ సమయంలో అల్లూరి జిల్లా చింతపల్లికి చెందిన ఇద్దరు యువకులతో పాటు ఒక బాలుడు వస్తూ పోలీసులను చూసి తమ వాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోయే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయితో పాటు వారి ఫోన్లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాను అడ్డుకున్న ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

వ్యాపారిపై ఆగంతుకుల దాడి

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం నవోదయ విద్యాలయ సమీపంలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై జీడి పిక్కలు కొనేందుకు వెళ్తున్న వ్యాపారి ముప్పన సత్యనారాయణపై నలుగురు ఆగంతులకు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తనది గంట్యాడ మండలం బోనంగి గ్రామమని తెలిపారు. బుధవారం ఉదయం గ్రామం నుంచి బొడ్డవర వైపు జీడి పిక్కలు కొనేందుకు వాహనంపై వెళ్తున్న సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి ఆపారన్నారు. డబ్బులు ఇవ్వమంటూ తనను లాగడం మొదలుపెట్టారన్నారు. అయితే డబ్బులు ఉన్న జేబును గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో తనను తోసేసి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారన్నారు. గాయాలపాలైన సదరు వ్యక్తి మండలంలోని ముషిడిపల్లి వద్ద మజ్జిగ చలివేంద్రం వద్దకు చేరుకుని అక్కడ సచివాలయం ఉద్యోగులకు చెప్పాడు. దాంతో మహిళ పోలీసు ద్వారా ఎస్.కోట పోలీసులకు సమాచారం ఇచ్చారు.

టోల్ ప్లాజాతో సాగునీటికి ఇబ్బంది

దత్తిరాజేరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మదికట్టు కాలువ పరిధిలో నిర్మిస్తున్న టోల్ ప్లాజా వల్ల సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో కాలువ పూర్తిగా కుచించుకుపోయిందని టోల్‌ప్లాజా ఆర్ఎంటీ జాయింట్ ఇంజనీర్ సురేష్‌కుమార్‌కు దృష్టికి బుధవారం రైతులు తీసుకెళ్లారు. గ్రామస్థుల అభ్యర్థనతో ఇరిగేషన్, ఆర్ఎంపీ డిపార్ట్‌మెంట్‌లు.. రెవెన్యూశాఖ సమక్షంలో కాలువను సర్వే చేయించి పూడిక తీయించి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేదెల రామసత్యం, గాడి అప్పలనాయుడు, స్థానికులు రౌతు రామనాయుడు, గొర్లె వెంకటరమణ, ఆరాధ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం రిలే దీక్షలు

రాజాం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెల 10, 11 తేదీలలో ఇక్కడి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను కార్మికులు జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. ఇక్కడి మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం నగర పంచాయతీగా ఏర్పడి రెండు దశాబ్దాలు కావస్తున్నా కార్మికుల సంఖ్యను పెంచలేదని ఆరోపించారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని, తద్వారా అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు, గ్లౌజులు ఇవ్వడం లేదన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ యంత్రాంగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వండి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రుణసాయం అందించే వరకూ సీపీఐ పోరుబాట కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట రెండో రోజు బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు రంగరాజు, అప్పలరాజు, వాసు, సూరీడమ్మ, కామేశ్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు విద్యాసంస్థల్లో బుక్ స్టాల్స్'

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్నాయని ఏబీవీపీ కన్వీనర్ సాయికుమార్ ఆరోపించారు. బుధవారం నగరంలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో బుక్స్, బ్యాగ్‌లు అమ్ముతున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్య సామగ్రిని అమ్ముతుంటే, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇవ్వండి

భోగాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరుకొండ వెంకటరావు డిమాండ్ చేశారు. భోగాపురంలో బుధవారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం అధికంగా ఉన్న బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనన్నారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ధర్నాను అందకూ జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 'మరమ్మతులు లేక.. తాగు నీరందక' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వస్తున్న వరస కథనాలకు స్పందించి బొబ్బిలి మండలంలోని పలు గ్రామల్లో బోర్లు, పైపులైన్లను బాగుచేసి, నీటి సమస్యను పరిష్కరించామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డిల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం బొబ్బిలిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా ఏఈ శ్రావణకుమార్ పర్యవేక్షణలో మెకానిక్ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడైన బోర్లను బాగు చేశారని ఆయన చెప్పారు. ఇప్పటివరకు కలవరాయి, వాకాడవలస, కోమటిపల్లి, వద్దువలస, నిమ్మలపాడు, రాజుపేట, దిబ్బగుడ్డివలస తదితర గ్రామల్లో సుమారు 36 వరకు బోర్లను వినియోగంలోకి తీసుకువచ్చామని ఆయన తెలిపారు. అలాగే పైప్‌లైన్లను సరిచేసి తాగునీ రు అందించామని చెప్పారు. ఇంకా క్రాష్‌ప్రోగ్రాం టీం గ్రామాల్లో పర్యవేక్షి స్తోందని, ఎక్కడయినా పాడైన బోర్లను గుర్తిస్తే వాటిని కూడా బాగు చేసి, మండలంలో తాగునీటి సమస్యకు చెక్ పెడతామని ఆయన తెలిపారు.

గ్యాస్ ధరల పెంపు అన్యాయం

రామభద్రపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారులకు కొమ్ముకాసి పేదలపై పిడుగు వేయడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు ఆరోపించారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బుధవారం గొల్లలపేట గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు లెంక ఈశ్వరరావు, తిరుపతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి గ్రామ నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అలజంగిలో రూ.35లక్షల వ్యయంతో సచివాలయ భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. అనంతరం చలివేంద్రంను ప్రారంభించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి నిత్యావసరాలు

భోగాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపలకంచేరులో జరిగిన అగ్ని ప్రమాదంలో కోలా ఎల్లయ్య ఇల్లు దగ్ధం కావడంతో ఆ కుటుంబానికి జనసేన నాయకులు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి బుధవారం రూ.11వేలు నగదు, రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు త్రినాథ్, పడాల శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రామభద్రపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంపై ప్రతి మహిళా అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి సూచించారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జన్నివలస అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌషికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే రొంపల్లి గ్రామంలో కూడా ఈ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస, జగన్నాథపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం పెదగుడబ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రాజెక్టు అధికారి సుగుణకుమారి, సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేలా శ్రద్ధ కనపర్చాలన్నారు.

● కురుపాం: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం కురుపాంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామభద్రపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవలస శివారులో పేకాట ఆడుతున్న వారిపై స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. కాకర్లవలస శివారులో గల మామిడితోటలో పేకాట ఆడుతున్న 15 మంది వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి 15 బైకులు, రూ.లక్షా 72వేల 900 నగదు, రూ.15సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు వాటిని తదుపరి చర్యల నిమిత్తం రామభద్రపురం పోలీసులకు అప్పగించారు. ● బొబ్బిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలస గ్రామంలో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.23,600 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

కాలువ వేశారు.. రోడ్డు మరిచారు

● బిల్లులు విడుదలలో జాప్యం.. సగంలో నిలిచిన పనులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాశిందొరవలస పంచాయతీ చిలకమ్మవలసలో పల్లె పండుగలో భాగంగా రూ.5లక్షల నిధులతో డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే డ్రైనేజీ కాలువలు నిర్మించారు కానీ సీసీ రోడ్డు మాత్రం వేయలేదు. కంకర గ్రావెల్ వేసి సీసీ రోడ్డు వేయకుండా వదిలేశారు. సుమారు నాలుగు నెలలుగా ఆ పనులు అలాగే ఉన్నాయి. బిల్లులు విడుదలలో జాప్యం కారణంగా పనులను సగంలో నిలిపివేసినట్టు గుత్తేదారు చెబుతున్నారు. ● ఈ విషయంపై పీఆర్ ఏఈ రాజశేఖర్‌ని వివరణ కోరగా నిధులు మంజూరు కాగానే సీసీ రోడ్డు నిర్మాస్తామని తెలిపారు.



కాలువలు నిర్మించి, సీసీ రోడ్డు నిర్మించని దృశ్యం

మంత్రి X జడ్పీ చైర్మన్

(5వ పేజీ తరువాయి)

కోరారు. ఆ తర్వాత మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పెన్షన్‌లు తొలగిస్తున్నారని, గత ప్రభుత్వం ఈ విధంగా చేయలేదని అనగానే మంత్రి కొండపల్లి ధీటుగా బదులిచ్చారు. గత ప్రభుత్వ నిర్వాకాలు చాలా ఉన్నాయని, అవన్నీ చెప్పుకుంటే సమావేశం సమయం కూడా చాలదని, పెన్షన్‌ల విషయంలో గత ప్రభుత్వం అనర్హులకు పెద్దపీట వేసిందన్నారు. అర్హులకు అందాలన్న ఉద్దేశంతో ప్రస్తుతం దానిపై సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హుల పెన్షన్‌లు తొలగించబోమని స్పష్టం చేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

జడ్పీ సమావేశం అజెండాలో తొలి అంశంగా గ్రామీణ నీటి సరఫరా విభాగంపై సమీక్ష జరిగింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన ఎస్ఈలు తమ, తమ జిల్లాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు, వేసవి నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై వివరించారు. దీనిపై ఎమ్మెల్సీ పీవీ సూర్యనారాయణరాజు, తెర్లాం జడ్పీటీసీ, గజపతినగరం జడ్పీటీసీ గార తౌడు తదితరులు తమ, తమ ప్రాంతాల్లో వేసవిలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వీటిని పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్య ఎక్కడ ఉన్నా పరిష్కరించాలని జడ్పీ చైర్మన్ ఎస్ఈలకు సూచించారు. ఇదే విషయమై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిధులు అవసరమైతే ఎంపీ నిధుల నుంచి వినియోగించాలని సూచించారు. తాగునీటి అవసరాల కోసం అత్యవసరంగా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు.

● ఉపాధి హామీ పథకంపై సమీక్షలో పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు మాట్లాడుతూ ఉపాధి వేతనాల బకాయిల గురించి ప్రశ్నించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఉపాధి వేతనాలు ఈ నెలలోనే చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. కాగా జడ్పీ సర్వసభ్య సమావేశంలో 11 శాఖలపై సమీక్ష జరిగింది.

ప్యాకేజీ అందేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రకటించి, తమకు వేరే చోట నిర్వాసిత కాలనీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తే నిర్వాసిత కాలనీ నిర్మాణంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రతీ కుటుంబంలోని 18 ఏళ్ల నిండిన వ్యక్తులకు ఆర్థిక సాయం సమకూరుతుంది. దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో గతంలో గ్రామానికి చెందిన సర్పంచ్ రాయి విభూషణరావుతోపాటు ఇతర నాయకులు కొద్ది రోజులు రిలే దీక్షలు కూడా చేశారు. తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు సాధ్యం కాకపోతే కనీసం ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్ (పీఏఎఫ్) ప్యాకేజీ అయినా అమలు చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం పీఏఎఫ్ ప్యాకేజీ అమలు చేస్తామని చివరి వరకు ఊరించి ఉస్సూరుమనిపించింది. పీఏఎఫ్ ప్యాకేజీ కోసం సర్వే చేసిన అధికారులు 1,293 పేర్లతో జాబితాను కూడా పునరావాస పునర్నిర్మాణ శాఖ అధికారులకు పంపించారు. అయినా ఎటువంటి కదలికేక లేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఆర్‌ఆర్ ప్యాకేజీ లేదా పీఏఎఫ్ ప్యాకేజీ అమలు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాజాం ఎన్నాళ్లిలా?

(5వ పేజీ తరువాయి)

ఆస్తులున్నాయి. శ్రీనివాస, శ్రీసూర్య, అన్నపూర్ణ, రాజీవ్‌గాంధీ కాంప్లెక్సుల పరిధి లో 74 షాపులున్నాయి. గతంలో వీటి ద్వారా లక్షల రూపాయల ఆదాయం సమకూరేది. తర్వాత రోజుల్లో చాలా షాపులు శిథిలావస్థకు చేరాయి. వాటిని ఆధునీకీకరిం చడం లేదు. కొత్తగా నిర్మించే ఆలోచన చేయడం లేదు. పాత ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న షాపులు నిరుపయోగంగా మిగిలాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలం మారడంతో షాపులు మొత్తం ఖాళీ చేసి వెళ్లిపోయారు. 20 సంవత్సరాలుగా పాలకవర్గాలు లేక వీటి గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. వర్తక, వాణిజ్య పట్టణంగా గుర్తింపు పొందిన రాజాంలో షాపులకు చాలా గిరాకీ. సగటున ఒక షాపు అద్దె నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉంటోంది. ఈ లెక్కన 74 షాపుల నుంచి ప్రతి నెలా రూ.7 లక్షలకు పైగా ఆదాయం సమకూరాలి. ఆ దిశగా మునిసిపాల్టీని ముందుకు తీసుకెళ్లే వారు కరువయ్యారు.

ఆర్టీసీకి ధారాదత్తం

పట్టణం నడిబొడ్డున ఆర్టీసీకి 1.42 ఎకరాల భూమిని కేటాయించారు. మునిసిపల్ అవసరాల కోసం గతంలో ఈ భూమిని రిజర్వులో ఉంచారు. కానీ ఆర్టీసీ విన్నపం మేరకు దశాబ్ద కాలం కిందట స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ.30 కోట్ల పైమాటే. కానీ ఈ ప్రాంత ప్రజల రవాణా అవసరాల కోసం ఆర్టీసీ డిపో ఏర్పాటుచేస్తామని చెప్పడంతో కేటాయించారు. ఇంతవరకూ డిపో ఏర్పాటుచేయలేదు. తిరిగి మునిసిపాలిటీకి వేరొక చోట స్థలం అప్పగించలేదు. గత ఏడాది జూలై 11న డిపో నిర్మాణానికి సంబంధించి అప్పటి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

కనీస వసతులు లేవు

పేరుకే మునిసిపాల్టీ. కనీస స్థాయిలో కూడా వసతులు లేవు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణం దారుణ నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం మునిసిపాల్టీపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి

- పినిశెట్టి గణేష్, స్థానికుడు, రాజాం

ప్రభుత్వం దృష్టి పెట్టాలి

మునిసిపాల్టీలో ఘోరమైన పరిస్థితులు నెలకొన్నాయి. పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతోంది కానీ అందుకు తగ్గట్టుగా ప్రజలకు వసతులు కల్పించలేకపోతున్నారు. మిగతా మునిసిపాల్టీల్లో పరిస్థితి బాగానే ఉంది. రాజాం విషయానికి వచ్చేసరికి వివక్ష కొనసాగుతోంది. ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

- వి.సాంబమూర్తి , స్థానికుడు, రాజాం

మౌలిక వసతులు కల్పిస్తాం

రాజాం మునిసిపాల్టీపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. ఇప్పటికే నివేదికలు రూపొందించాం. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నాం. మున్సిపాల్టీకి సంబంధించి షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆస్తుల వినియోగానికి చర్యలు తీసుకున్నాం.

- జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మునిసిపాల్టీ

కొత్త వంగడాలను ఆవిష్కరించాం

(5వ పేజీ తరువాయి)

అవసరం. లేకుంటే ఉష్ణోగ్రతలు తగ్గవు.

ప్రశ్న: కొత్త వంగడాలు వచ్చాయా?

జ: ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు వరి, ఇతర పంటల కోసం నిత్యం అధ్యయనం చేస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉపయోగించేందుకు వరి, మొక్కజొన్న, వేరుశనగ, అపరాల నూతన వంగడాలను ఆవిష్కరించాం. ఈ వంగడాల పట్ల రైతులకు అవగాహన కల్పిస్తాం. కొత్త వంగడాలు రైతులకు అధిక ప్రయోజనాన్ని చేకూర్చుతాయి.

ప్రశ్న: మామిడి, జీడి విస్తీర్ణం తగ్గుతోందా?

జ: విజయనగరం ఉమ్మడి జిల్లాగా ఉండేటప్పుడు మామిడి, జీడి పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. విడిపోయిన తరువాత విజయనగరంలో మామిడి పంట తగ్గినప్పటికీ దాదాపు 75 వేల ఎకరాల్లో సాగు విస్తరించి ఉంది. విజయనగరం, మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి, మెంటాడ, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, కొత్తవలస, బొండపల్లిలో ఎక్కువగా మామిడి తోటలు ఉన్నాయి. జీడి పంట విషయానికి వస్తే మెరకముడిదాం, చీపురుపల్లి, బొండపల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కువ.

ప్రశ్న: ఫలసాయం పరిస్థితి ఏంటి?

జ: మామిడికి సంబంధించి గత ఏడాది కంటే ఫలసాయం పెరిగే అవకాశం వుంది. అంతకుముందు ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా ఈ ఏడాది అధికంగా నమోదైంది. ఈ నేపథ్యంలో మామిడి, జీడి పంటలు కలిసి వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: మామిడి సాగు పెరగాలంటే ఏం చేయాలి?

జ: గతంలో మామిడిని ఒడిశాలోని భువనేశ్వర్, జైపూర్, డిల్లీ తదితర ప్రాంతాలకు విజయనగరం నుంచి ఎగుమతి చేసేవారు. పదేళ్లుగా ఆ పరిస్థితి లేదు. ఇక్కడి పంటను ఇక్కడే రైతులు అమ్ముకుంటున్నారు. మామిడి ఆధారిత పరిశ్రమలకు సంబంధించి విజయనగరంలో ఒక్క మామిడి తాండ్ర తప్ప వేరేది లేదు. మామిడి ప్రోసెసింగ్ ఆధారంగా పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది. రైతులకు మంచి ధర వస్తుంది. మరింతగా సాగు చేయాలని ఆసక్తి చూపుతారు. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

మ్యుటేషన్ కష్టాలు

(5వ పేజీ తరువాయి)

మ్యూటేషన్ కాక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు సంబంధించి ఎంఏఎంసీ ధ్రువపత్రాలే ఎక్కువ ఉన్నాయి. గతంలో ఇంటిలో ఎవరైనా మృతిచెందితే ఆ వ్యక్తికి సంబంధించిన రక్త సంబంధీకుల వివరాలతో లీగల్‌హెయిర్ ధ్రువపత్రాన్ని రెవెన్యూ అధికారులు మంజూరు చేసేవారు. తర్వాత కాలంలో లీగల్ హెయిర్‌కు బదులు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్(ఎఫ్ఏఎంసీ) ఇచ్చారు. దీని ఆధారంగా ఆస్తులు వారసుల పేరున మార్పు జరుగుతుండేవి. వైసీపీ హయంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ వచ్చాక ఎఫ్ఏఎంసికి బదులుగా ఎఫ్ఎంసీలు జారీ చేస్తున్నారు. దీంతో ఎఫ్ఏఎంసీ పత్రాలు మ్యుటేషన్‌కు ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదు. ఎఫ్ఏఎంసి నెంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేశాక ఇన్వాలిడ్ యూసర్ అని చూపించడంతో అప్లికేషన్ ముందుకు వెళ్లడం లేదు. ఎఫ్ఎంసీ ఉన్న పత్రాలను మాత్రమే ఆన్‌లైన్‌లో తీసుకుంటున్నాయి. ఎఫ్ఏఎంసి అనేది రాష్ట్రస్థాయిలో పరిష్కరించాల్సిన సాంకేతిక సమస్యగా ఉంది. ఈ పత్రాలు ఉన్నవారు నేడు చాలా ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది రైతుల వద్ద ఎఫ్ఏఎంసిలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



రూ.42 కోట్ల బిల్లులు పెండింగ్

● ఉపాధి హామీ ఏపీడీ రమామణి

రామభద్రపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలో ఈ ఏడాది జనవరి 17వ తేదీ నుంచి పల్లె పండుగ పనులకు సంబంధించి, ఉపాధి వేతనదారుల వేతనాలు మొత్తం రూ.42కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఉపాధి హామీ ఏపీడీ రమామణి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రత్నం, ఏపీవో త్రినాథరావుతో కలిసి ఆమె ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెపండగ పనులకు సంబంధించి రూ.24 కోట్లు, ఉపాధిహామీ వేతనదారులకు అందాల్సిన వేతనాలకు సంబంధించి రూ.18కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనిచేస్తే వేతనం గిట్టుబాటవుతుందన్నారు. లేబర్ మొబలైజేషన్, ఫాంపాండ్స్, ఫిష్ పాండ్స్, అగ్రి ఎలైన్‌మెంట్ పనులు, పశువుల నీటితొట్లెల పనులపై దృష్టి సారించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధకశక్తితో వ్యాధులు దూరం

నెల్లిమర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక శక్తితో వ్యాధులను దూరం చేయవచ్చని వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డా.వ్యాకరణం నాగేశ్వర్ అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వవి ద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మెడికల్ స్కిల్స్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగేశ్వర్ మాట్లాడుతూ త్వరలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం, వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ మెడికల్ స్పెషలిస్టు అసిస్టెంట్ ప్రోగ్రాం అనే కొత్త కోర్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ చైతన్య, ఫారెన్సిక్, ఎనస్థీషియా విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.40 కోట్లు

● ఎమ్మెల్యే బేబీనాయన



పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బొబ్బిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటర్నల్ రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.40కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించినట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. బుధవారం బొబ్బిలిలోని దర్బారు మహల్‌లో పంచాయతీరాజ్ డీఈ, ప్రాజెక్ట్ డీఈలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి రోడ్ల నిర్మాణం జరగలేదన్నారు. మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు హయాంలో మంజూరైన పనులను గత ప్రభుత్వం విస్మరించడంతో దాదాపు 43 గ్రామాలకు రోడ్ల కనెక్టవిటీ లేకుండా పోయిందని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా రూ.20కోట్లతో 16 గ్రామాల మధ్య పక్కా రోడ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరానని చెప్పారు. రాబోయే నాలుగేళ్ల కాలంలో దశలవారీగా చేపట్టేందుకు రోడ్ల పనులపై సమగ్ర నివేదికను తయారు చేయాలని కోరామన్నారు. ఇంకా ఈ ఏడాదిలో ప్రతి గ్రామంలో రోడ్లు, కాలువలు నిర్మాణానికి రూ.40కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఈ నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్ డీఈఈ అప్పారావు, ప్రాజెక్ట్ డీఈఈ సీతంనాయుడు, టీడీపీ నాయకుడు అల్లాడ భాస్కరరావు, నాలుగు మండలాల జేఈలు రుక్మాంగదనాయుడు, రాజశేఖర్, రమేష్, సత్యంనాయుడు పాల్గొన్నారు.

ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

బొబ్బిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పోలీసు సర్కిల్ పరిధిలోని అన్ని మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలు, మందిరాలు, దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ కటకం సతీష్‌కుమార్ హితవు పలికారు. బుధవారం ఆయన బొబ్బిలిలోని తన కార్యాలయంలో మాట్లాడారు. సున్నితమైన ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు డేగ కన్నులా పనిచేస్తాయన్నారు.

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు రాజాం పురపాలక సంఘము

రేఖా నెం. 350/2025/ఎ1, **బహిరంగ వేలం నోటీసు** తేది: 09.04.2025

రాజాం పురపాలక సంఘమునకు చెందిన ఈ దిగువ సుదహరించిన గుత్తలు 2025-2026 సంవత్సరంనకు అనగా తే: 01.04.2025 ది నుండి తే: 31.03.2026 ది వరకు ఈ పురపాలక సంఘమునకు చెందిన షాపు రూములకు సంబంధించి బహిరంగ వేలంను తే: 25.03.2025న అనగా మంగళవారం ఉదయం 11.00 గంటలకు నిర్వహించగా ఎవరు కూడా పాటలో పాల్గొననందున మరలా తే: 16.04.2025దిన అనగా మంగళవారం ఉదయం 11.00 గంటలకు ఈ పురపాలక సంఘము కార్యాలయములో కమిషనర్ వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని నిర్వహించబడును. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు ఈ పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిల కలిగియుండరాదు. మరియు ఎన్‌కంబ్రెన్ సర్టిఫికేట్ మరియు రోడ్డు మార్జిన్, కబేళ సర్టిఫికేట్‌ను సబ్ రిజిస్టర్, రాజాం వారి కార్యాలయము నుండి తే: 19.03.2025ది తరువాత పొందినది దాఖలు చేయవలెను. సాల్వేన్సీ సర్టిఫికేట్‌ను ధరావత్తుతో పాటు వేలం సమయములో దాఖలు చేయవలెను. పాటదారులు గజిట్ నోటిఫికేషన్‌లోని నిబంధనలకు బద్ధులై యుండవలెను.

వ. నం.	షాపింగ్ కాంప్లెక్స్ పేరు	షాపు నం.	కేటగిరి	చెల్లించ వలసిన ధరావత్తు సొమ్ము	తే:10.04.2025ది నుండి తే:15.04.2025ది లోగా రాజాం పురపాలక సంఘము కమిషనరు వారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్	గుత్త కాలము
1.	రాజీవ్ గాంధీ బస్ కాంప్లెక్స్	4	OC(G)	5000	50000	తేది. 1.4.2025 నుండి తేది. 31.3.2027
2.		5	OC(G)	5000	50000	
3.		6	OC PHC(W)	5000	50000	
4.		7	OC(G)	5000	50000	
5.		8	BC	5000	50000	
6.		9	OC	5000	50000	
7.	బస్ స్టాండ్ అవుట్ గేట్	2	SC(W)	5000	50000	
8.		4	BC	5000	50000	
9.		5	OC	5000	50000	
10.	అన్నపూర్ణ షాపింగ్ కాంప్లెక్స్	1	BC	5000	50000	
11.		2	OC	5000	50000	
12.		3	OC	5000	50000	
13.		6	OC PHC(W)	5000	50000	
14.		9	BC	5000	50000	
15.		10	BC(W)	5000	50000	
16.		11	OC	5000	50000	
17.		12	BC	5000	50000	
18.		13	SC	5000	50000	
19.		14	BC	5000	50000	

కమీషనర్, రాజాం పురపాలక సంఘము



